నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | ఆదివారం 6 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మంచిర్యాల ఎంఎల్ఎస్ పాయింట్‌లో తడిసిన బియ్యం బస్తాలను ఆరబెట్టిన సిబ్బంది

సన్న బియ్యం బుక్కేస్తున్నారు..

సన్న రేషన్ బియ్యం తూకంలో తేడాలు..!

- ఒక్కో రేషన్ షాపునకు రెండు క్వింటాళ్ల నుంచి మూడు క్వింటాళ్ల కోత
- తూకం వేయకుండానే స్టేజ్-1 కాంట్రాక్టర్ నుంచి స్టేజ్-2 క్రాంటాక్టర్‌కు అప్పగింత
- తక్కువ తూకం ఉన్న బియ్యం బస్తాలే నేరుగా రేషన్ షాపులకు సరఫరా
- ఎంఎల్ ఎస్ పాయింట్‌లో అధికారులు, కాంట్రాక్టర్ల మాయాజాలం
- మొన్న రాత్రి వర్షానికి స్టేజ్-1 లారీ నుంచి స్టేజ్-2 లారీలోకి లోడ్ చేస్తుండగా తడిసిన బియ్యం
- ఎంఎల్ ఎస్ పాయింట్‌లో దాదాపు 50 క్వింటాళ్లు ఆరబోసిన అధికారులు
- గుట్టు చప్పుడు కాకుండా ఆ బియ్యాన్నే రేషన్ షాపులకు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు
- ఉన్నతాధికారులకు ఇప్పటి దాకా సమాచారం ఇవ్వని ఎంఎల్ ఎస్ పాయింట్ నిర్వాహకులు
- నిద్రావస్థలో ఉన్నతాధికార యంత్రాంగం.. కాంట్రాక్టర్లు ఇచ్చే మామూళ్లే కారణమా..?

మంచిర్యాల, ఏప్రిల్ 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా చేపడుతున్న సన్న రేషన్ బియ్యం పంపిణీలో అప్పుడే అక్రమాలు మొదలయ్యాయి. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు, కాంట్రాక్టర్ల మాయాజాలంతో మొదటి రోజే రేషన్ షాపులకు వచ్చిన బియ్యం తూకాల్లో తేడాలున్న విషయం తెలిసింది. పౌరసరఫరాల శాఖలోని కొందరు దొంగలు పందికొక్కుల్లా మారి సర్కారు సరఫరా చేస్తున్న బియ్యాన్ని బుక్కేస్తున్న ఉదంతం వెలుగులోకి వచ్చింది. సన్నబియ్యం అనే కాదు గతంలో దొడ్డు బియ్యం పంపిణీ సమయంలోనూ సదరు అధికారులు ప్రతి నెలా లక్షలాది రూపాయల విలువైన బియ్యం స్వాహా చేసినట్లు తెలిసింది. అసలు ఈ తూకంలో తేడాలకు కారణం ఏమిటి.. తప్పు చేస్తున్న అధికారులు ఎవరు.. ఆ వివరాలు.. వాటికి సంబంధించిన ఆధారాలు ఇలా ఉన్నాయి.

నెలకు రూ.15 లక్షల నుంచి 20 లక్షల స్కామ్

రేషన్ షాపులకు వెళ్లే బస్తాలు తక్కువ తూకంతో పం పించడంతో నెలకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్ష లు ఎంఎల్ఎస్ పాయింట్ నిర్వాహకులు, కాంట్రాక్టర్లకు మిగులుతున్నాయి. ఒక్కో రేషన్ షాప్‌నకు ప్రతి నెలా రెండు క్వింటాళ్ల నుంచి మూడు క్వింటాళ్ల బి య్యం కోత పెడుతారు. ఇలా మంచిర్యాల ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలోని 142షాపులకు రెండు క్వింటాళ్ల చొప్పున వేసుకుంటే 284 క్వింటాళ్లు అవుతుంది. క్వింటాలుకు సర్కారు ధర చొప్పున రూ.3000 వేసుకుంటే రూ.8లక్షలు అవుతుంది. ఇలా మొదటి 50 శాతం బియ్యం కోటాలో 284 క్వింటాళ్లు, రెండో 50 శాతం బియ్యం కోటాలో 284 క్వింటాళ్లకు లెక్కవేస్తే దాదాపు రూ.16 లక్షలు అవుతుంది. అంటే ఒక్క మంచిర్యాల ఎంఎల్ఎస్ పాయింట్‌లోనే ప్రతి నెలా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు అవుతుంది. దొడ్డు బియ్యం సరఫరా చేసిన ప్పటి నుంచి ఇదే తరహాలో మోసం జరుగుతున్నట్లు రేషన్ డీలర్లు చెబుతున్నారు. ఈ లెక్కనే ఇప్పటి వరకు కోట్ల రూపాయల స్కామ్ జరిగినట్లు తెలుస్తున్నది. ప్రతి నెలా వచ్చే మొత్తంలో ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి సహా పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారుల దాకా వాటాలు వెళ్తాయని చెబుతున్నారు. లేకపోతే ఇంత పెద్ద స్కామ్ ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా ఎలా జరుగుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా అటు కాంట్రాక్టర్‌కు లక్షల రూపాయల అదనపు బిల్లులు వస్తాయని, ఇటు అధికారులకు చేబులు నిండుతాయని అందుకే చూసీచూడనట్లు వ్యవహరిస్తుంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎంఎల్ ఎస్ పాయింట్‌లో గోల్‌మాల్..

రేషన్ బియ్యం తూకంలో తేడాలు రావడానికి అసలు కారణం ఎంఎల్ఎస్ పాయింట్‌లలో స్టేజ్-1 కాంట్రాక్టర్ నుంచి వచ్చిన బియ్యాన్ని తూకం వేయకపోవడమే అని నిగ్గుతేలింది. మొన్న కురిసిన వర్షానికి రేషన్ బియ్యం తడిసిందని, మంచిర్యాల ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఆ బియ్యాన్ని ఆరబోశారనే సమాచారం మేరకు శనివారం ఉదయం 'నమస్తే తెలంగాణ' ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శించింది. బియ్యం ఎందుకు తడిసినట్లు అని ఆరా తీయగా.. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి బియ్యం తడిసినట్లు చెప్పారు. స్టేజ్-1 కాంట్రాక్టర్ లారీలో బియ్యాన్ని పాయింట్‌కు తీసుకువచ్చారని.. దాన్ని గోదాంలో లోడ్ చేస్తున్న క్రమంలో వర్షం పడిందనన్నారు. అప్పటికీ సగం బస్తా లు దించగా లారీలోనే ఉన్న మిగిలిన సగం బస్తాలు తడిసినట్లు వివరించారు. అలా ఎన్ని బస్తాలు తడిసినయని అడుగగా, 20 బస్తాల నుంచి 30 బస్తాలు తడిసినట్లు ఎంఎల్ఎస్ పా యింట్ ఇన్‌చార్జి శంకర్ తెలిపారు. కానీ, అక్కడ ఆరబోసిన ఖాళీ బస్తాలను లెక్కవేయగా అవి దాదాపు 50కి పైచిలుకు ఉన్నాయి. అవి కాకుండా మరో 50 తడిసిపోయిన బస్తాలు ఓపెన్ చేయకుండానే బియ్యంతో సహా ఆరబెట్టి ఉన్నాయి. అదేంటి సార్ ఎక్కువ బస్తాలు కనిపిస్తున్నాయంటే ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి నుంచి సరైన సమాధానం రాలేదు. ఈ క్రమంలోనే స్టేజ్-1 కాంట్రాక్టర్‌కు చెందిన ఓ లారీ ఎంఎల్ఎస్ పాయింట్‌కు వచ్చింది. నిబంధనల ప్రకారం ఆ లారీలోని బియ్యం బస్తాలను ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంలో దించాలి. అలా దించుకున్న బియ్యాన్ని రే షన్ షాపులకు సరఫరా చేసే ముందే రేషన్ డీలర్ వచ్చి వేలిముద్ర వేశాక ఆయనకు ఎంత బియ్యం ఇవ్వాలో అంత తూకం వేసి పంపించాలి. కానీ స్టేజ్-1 కాంట్రాక్టర్ నుంచి వచ్చిన ఆ లారీ లోడ్ చాలా సమయం వరకు దించలేదు. కాసేపు అయ్యాక అక్కడికి స్టేజ్-2 కాంట్రాక్టర్(రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేసే) లారీ వచ్చింది. వెంటనే స్టేజ్-1 లారీ ఎక్కిన హమాలీలు అందులోని బియ్యం బస్తాలను తీసుకువచ్చి స్టేజ్-2 లారీలో లోడ్ చేస్తూ కనిపించారు. అదేంటి స్టేజ్-1 కాంట్రాక్టర్ లారీలో వచ్చిన బస్తాలను తూకం వేయకుండానే రేషన్ షాపులకు నేరుగా ఎలా సరఫరా చేస్తున్నారని ప్రశ్నించగా, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి అధికారి సహా అక్కడున్న హమాలీలు నీళ్లు నమిలారు. ఫొటోలు తీయగానే బస్తాలను లోడ్ చేయడం నిలిపివేశారు. కాసేపు ఆలోచించుకొని బయట తూకం వేసి రేషన్ షాపులకు తీసుకెళ్తామంటూ చెప్పుకొచ్చారు.

మంచిర్యాల ఎంఎల్ ఎస్ పాయింట్ నుంచి ఓ రేషన్ దుకాణానికి వచ్చిన బియ్యం బస్తాను తూకం వేయగా 44 కిలోల 340 గ్రాముల బరువే ఉన్న బియ్యం బస్తా

లారీ టూ లారీతోనే తూకంలో తేడాలు..

నిబంధనల ప్రకారం ఎంఎల్ఎస్ పాయింట్‌లో తూకం వేశాకే రేషన్ షాపులకు ఆ బియ్యాన్ని సరఫరా చేయాలి. కానీ మంచిర్యాల ఎంఎల్ ఎస్ పాయింట్‌కు స్టేజ్-1 కాంట్రాక్టర్ సరఫరా చేసిన బియ్యాన్ని తూకం వేయకుండా స్టేజ్-2 కాంట్రాక్టర్ ద్వారా నేరుగా రేషన్ షాపులకు సరఫరా చేస్తున్నారు. అలా పంపిన బియ్యం బస్తాల తూకాల్లో తేడాలు ఉంటున్నాయి. లెక్కప్రకారం గన్నీ సంచి బరువు 500 గ్రాములు అనుకుంటే రేషన్ షాపులకు వచ్చే ప్రతి బస్తా 50 కిలోల 500 గ్రాములు ఉండాలి. కానీ మంచిర్యాల ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్‌షాపులకు సరఫరా చేసిన బియ్యం బస్తాలు 44కిలోల నుంచి 50 కిలోల లోపు ఉంటున్నాయి. ఈ మేరకు రేషన్ డీలర్లను ఆరా తీయగా ఒక్కో రేషన్ షాపునకు రెండు క్వింటాళ్ల నుంచి మూడు క్వింటాళ్ల తక్కువ బియ్యం వచ్చినట్లు చెప్పారు. మరి ఈ విషయాన్ని డీలర్లైనా అధికారుల దృష్టికి ఎందుకు తీసుకెళ్లడం లేదంటే.. మేము మాట్లాడితే కేసులు పెట్టిస్తారని, స్టాక్ రిజిస్ట్రార్లు అడుగుతారని.. షాపులు శుభ్రంగా లేవని బెదిరిస్తారని.. ఆ వేధింపులు తట్టుకోలేక మిన్నకుండిపోతామని చెబుతున్నారు.

స్టేజ్-1 కాంట్రాక్టర్ లారీ నుంచి స్టేజ్-2 కాంట్రాక్టర్ లారీలోకి ఎలాంటి తూకం వేయకుండా బస్తాలను లోడ్ చేస్తున్న హమాలీలు

బియ్యం తడిసిన విషయం ఉన్నతాధికారులే తెలియదు..

ఎంఎల్ఎస్ పాయింట్‌లో వర్షానికి రేషన్ బియ్యం తడిసిన విషయంపై ఇప్పటి దాకా ఉన్నతాధికారులు సమాచారం ఇవ్వలేదని తెలిసింది. ఈ విషయాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి స్వయంగా చెబుతున్నారు. ఎందుకు సమాచారం ఇవ్వలేదంటే.. లారీలో నుంచి దించాక బియ్యం తడిశాయని, అప్పటికే లారీ వెళ్లిపోయిందని చెప్పుకొచ్చారు. ముందేమో లారీలో ఉండగానే తడిశాయి అన్నారు.. ఈ వ్యవహారం అంతా జరిగాక లారీలో నుంచి దించాక తడిశాయంటూ మాటా మార్చారు. వాస్తవానికి బియ్యం స్టేజ్-1 కాంట్రాక్టర్ లారీలో నుంచి స్టేజ్-2 కాంట్రాక్టర్ లారీలోనే నేరుగా లోడ్ చేస్తున్న క్రమంలో వర్షానికి తడిసినట్లు తెలిసింది. అదే స్టేజ్-1 కాంట్రాక్టర్ లారీ రాగానే ఎంఎల్ఎస్ పాయింట్‌లో దించుకొని ఉంటే తడిసేవి కాదు. ఇక్కడ అధికారి నిర్లక్ష్యం ఉండడంతో గట్టుచప్పుడు కాకుండా ఆ తడిసిన దాదాపు 50 క్వింటాళ్ల బియ్యాన్ని ఆరబోశారు. రెండు రోజుల్లో వాటిని తిరిగి బస్తాల్లోకి ఎక్కించి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఆరబోసిన బియ్యాన్ని పట్టుకుంటే ముక్కలైపోయి నూకలుగా మారుతున్నాయి. అలాంటి బయ్యాన్ని తిరిగి సరఫరా చేసేందుకు సిద్ధమవడం, బియ్యం తడిసిన విషయం ఉన్నతాధికారులకు చెప్పకపోవడం అనుమానాలకు తావిస్తున్నది.

పెద్ద కాంట లేదు.. అందుకే బయట తూకం

స్టేజ్-1 కాంట్రాక్టర్ లారీలో నుంచి వచ్చిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌లో తూకం వేయకుండానే స్టేట్ కాంట్రాక్టర్ లారీలోకి ఎక్కించి రేషన్ షాపులకు పంపించే వ్యవహారంపై ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి శంకర్‌ను వివరణ కోరగా.. ఎంఎల్ఎస్ పాయింట్‌లో పెద్ద కాంట లేదన్నారు. అందుకే బయట వే-బ్రిడ్జిలో తూకం వేసి పంపిస్తున్నట్లు చెప్పారు. మరి అలా వే-బ్రిడ్జిలో తూకం వేసిన రిసీప్టులు చూపించమని అడుగగా, వాట్సాప్ చేస్తానని చెప్పారు. సరే ధాన్యం తడిసిన విషయం ఉన్నతాధికారులు చెప్పారా అంటే చెప్పలేదు అన్నారు. ఎందుకు చెప్పలేదంటే.. ధాన్యం లారీలో నుంచి దించుకున్నాక తడిసిందని అందుకే చెప్పలేదని చెబుతున్నారు. ఇదే విషయంపై ముందేమో లారీలో ఉండగానే వర్షానికి ధాన్యం తడిసిందని చెప్పిన అధికారి.. ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదంటే లారీలో నుంచి దించాక తడిశాయంటూ చెప్పడం గమనార్హం. ఎంఎల్ఎస్ పాయింట్‌లో రెండు రోజులుగా ఇంత తతంగం నడుస్తున్నా తెలుసుకోలేని పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఉండడం అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికైనా అక్రమాలు పాల్పడుతున్న అధికారులు, తక్కువ బరువుతో బియ్యం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటారా లేకపోతే మామూళ్ల వ్యవహారం బయట పడుతుందని మిన్నకుండిపోతారా అన్నది వేచి చూడాల్సి ఉంది.

నీళ్ల గోస తీర్చండి సారూ..

నాగాపూర్‌లో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ కాలనీ మహిళలు

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 5 : 'తాగు నీళ్ల కోసం పక్షం రోజులుగా అరిగోస పడుతున్నాం. మా గోస తీర్చండి సారూ..' అంటూ మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం నాగాపూర్ గ్రామపంచాయతీలోని ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీతో పాటు బీసీ కాలనీ వాసులకు తాగు నీళ్లు అందించే బోరు పక్షం రోజుల క్రితం చెడిపోయిందని, పంచాయతీ సెక్రటరీ మౌనిక దృష్టికి తీసుకెళ్తే నిధులు లేవని, నా చేతిలో ఏమీ లేదని, స్పెషల్ ఆఫీసర్‌ను అడగండి అంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ పనులను వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తున్నామని, కష్టం చేసి వచ్చి నీళ్లకు వేరే కాలనీకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వారు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రాకపోకలు షురూ.. బీఆర్ఎస్ హర్షం

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 5 : రామకృష్ణాపూర్ ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో బీఆర్ఎస్ శ్రేణులతో పాటు స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. శనివారం రామకృష్ణాపూర్‌లోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై అనధికారికంగా ప్రథమంగా బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభమైన సందర్భంగా కేసీఆర్, కేటీఆర్, బాల్క సుమన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేసీఆర్ సర్కారు చొరవతో నిర్మాణం పూర్తి చేసినందుకు మాజీ ఎమ్మెల్యే, విప్, బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌కు నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు డా. రాజా రమేశ్ మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో ఉన్న అడ్డంకులు, ఇబ్బందులను తొలిగించి సరిపడా నిధులు సమకూర్చిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో భూసేకరణ విషయంలో నిర్వాసితులు కోర్టును ఆశ్రయించారని, వారితో మాట్లాడి.. వారికి నష్టపరిహారం ఇప్పించి పనులు ప్రారంభించడానికి యేడాదిన్నర కాలం పట్టిందని, అదే విధంగా కరోనా సమయంలో పనులు చేస్తున్న వారందరూ వారివారి స్వగ్రామాలకు వెళ్లడం వల్ల ఏడాదిన్నర కాలం పట్టిందని, బ్రిడ్జి నిర్మాణానికి మొదట మంజూరైన రూ. 27 కోట్లు సరిపోకపోవడంతో కేసీఆర్ ప్రభుత్వం మరో రూ. 8 కోట్లు మంజూరు చేయించిందన్నారు. బ్రిడ్జి నిర్మాణం 90 శాతం పూర్తికావస్తున్న సమయంలో శాసన సభ ఎన్నికలు వచ్చాయని, ఏదేమైనా బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో విడుదలైన నిధులతోనే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తామే నిర్మించామని ఎక్కడ తప్పుడు ప్రచారం చేస్తుందోనని.. కేసీఆర్, కేటీఆర్, బాల్క సుమన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. ఇక చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచి ఏడాదిన్నర కావస్తున్నా వివేక్ వెంకటస్వామి క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించింది లేదన్నారు. వివేక్ వెంకటస్వామి సొంతంగా ఇచ్చిన 45 వేల ఉద్యోగాల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు రామిడి కుమార్, జాడి శ్రీనివాస్, బడికల సంపత్‌కుమార్, మాజీ జడ్పీటీసీ రవి, అలుగుల సత్తయ్య, నందిపేట సదానందం, అశనవేన సత్యనారాయణ, లక్ష్మీకాంత్, చంద్రకిరణ్, గోనె రాజేందర్, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్, బాల్క సుమన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శంకర్ ఇంట్లో నేలపై కూర్చొని భోజనం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే

పేదోడి ఇంట కలెక్టర్ భోజనం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 5 : జిల్లా కేంద్రంలోని జనకాపూర్ పునరావాస కాలనీలో రేషన్ లబ్ధిదారుడు తాక్సండే శంకర్ ఇంట్లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు లబ్ధిదారులతో కలిసి ప్రభుత్వం ఉచితంగా అందించిన సన్నబియ్యంతో భోజనం చేశారు. అర్హత గల లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నామని, ఇది నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ తెలిపారు. శంకర్ మాట్లాడుతూ కలెక్టర్‌తో పాటు అధికారులు తన ఇంట్లో భోజనం చేసినందుకు చాలా సంతోషంగా ఉందన్నాడు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.